క్లుప్తంగా

కేజీబీవీకి ఫ్యాన్ల వితరణ



బయ్యారం : మండలంలోని జగ్గుతండా కేజీబీవీకి బహుజన నాయకుడు డాక్టర్ వివేక్ అందజేసిన 25 సీలింగ్ ఫ్యాన్లను గురువారం డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా జీసీడీఓ విజయకుమారి మాట్లాడుతూ.. పేద విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలకు ఫ్యాన్లను డాక్టర్ వివేక్ అందజేయడం అభినందనీయమన్నారు. న్యాయవాది హరినాయక్, ఎస్ఓ నీలిమా, డీఎస్ఎఫ్ఐ నాయకులు సాయికుమార్, దీపక్, దేవేందర్, బాలాజీ, రమేష్, రాము, చంటి, తరుణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గార్ల : మండలంలోని పూమ్యాతండాకు చెందిన రైతు ఊరుకొండ వెంకన్న పాడిగేదె గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఉదయం గేదెను మేతకు వదలగా తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.70,000 ఉంటుందని రైతు వెంకన్న పేర్కొన్నారు. గేదె మృతిచెందడంతో నష్టపోయానని, ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

హామీలు నెరవేర్చాలి

● యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి



మహబూబాబాద్ : సమాన పనికి–సమాన వేతనం అమలు చేయాలని, హామీలు నెరవేర్చాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. మానుకోట జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా కేవలం రూ.9,500 చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డీపీఓ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు బీకు, సోమనర్సయ్య, వెంకన్న,రాము, రమేష్, లక్ష్మ య్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కురవి : మండలంలోని నేరడ శివారు కాకులబోడు తండా మాజీ సర్పంచ్ భర్త గుగులోత్ కిషన్ నాయక్ ఇటీవల మృతి చెందాడు. గురువారం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తండాకు వెళ్లి బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. కిషన్ నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు శ్రీను, బాదె నాగయ్య, కిషోర్ వర్మ, నెహ్రూనాయక్, నరహరి, రవినాయక్, మంగీలాల్ నాయక్, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు ప్రారంభమయ్యేనా?

కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు

● అకాల వర్షాలతో ఆందోళన

● ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



మునిగలవీడు కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం

నెల్లికుదురు : ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను విక్రయించేందుకు తీసుకు రాగా కొనే వారు లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పంట సాగు మొదలుకొని విక్రయించే వరకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అకాల వర్షాలతో అప్రమత్తమైన రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు చేయించి 15 రోజులు దాటింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులు పోసి ఎదురు చూస్తున్నారు. ఉదయం ఎండకు నేర్పి..సాయంత్రం దగ్గరకు రాశులుగా చేసి టార్పాలిన్లు కప్పలేక నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలల్లోని రైతులు 19వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 4.10లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలో మొత్తం 19 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నెల్లికుదురు సొసైటీ ఆధ్వర్యంలో 9, శ్రీరామగిరి సొసైటీ ఆధ్వర్యంలో 6, ఎర్రబెల్లిగూడెం సొసైటీ ఆధ్వర్యంలో 2, ఐకేపీ ఆధ్వర్యంలో 2, మొత్తం 19 సెంటర్లను అధికారులు సిద్ధం చేశారు. అయితే ఈ నెల10న మండలంలోని మునిగలవీడు పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సందర్శించి కేంద్రంలో రైతులు నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని నిల్వ చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

కేంద్రాలను ప్రారంభించాలి



జిల్లాలోనే మొదటగా మండలంలోని మునిగలవీడు పరిధిలో యాసంగి వరి పంట కోతలు మొదలయ్యాయి. 20రోజులుగా కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ కూడా కేంద్రాన్ని సందర్శించారు. వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదు. అధికారుల స్పందించి కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

– బైస స్వామి, రైతు

రైతుల సంక్షేమమే ధ్యేయం

● ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రు నాయక్

కురవి/మరిపెడ రూరల్/చిన్నగూడూరు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. గురువారం కురవి మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో.. మరిపెడ మండలం తానంచర్ల, బుర్హాన్‌పురం, ఆనేపురం, చిల్లంచర్ల, బీచ్‌రాజ్‌పల్లి, అబ్బాయిపాలెం, గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో,చిన్నగూడూరు మండలంలోని విస్సంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. రైతు భరోసా ఇచ్చామన్నారు. మరిపెడ ఆత్మ చైర్మన్‌గా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డికి అందజేయడంతో సుధాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే కురవిలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. తానంచర్ల హైస్కూల్, గంగమ్మ ఆలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, చైర్మన్లు ఇస్లావత్ సుధాకర్, గార్లపాటి వెంకటరెడ్డి, కొర్ను రవీందర్‌రెడ్డి, బండి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బండి లక్ష్మారెడ్డి, జక్కుల నాగన్న, సుకేందర్‌రెడ్డి, ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

స్వయంకృతాపరాధంతో ఓడిపోయాం..

● మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ : ఎవరు తమను ఓడించలేదని, కేవలం స్వయంకృతాపరాధంతోనే ఓటమి పాలయ్యామని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పేర్కొన్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మరిపెడ, చిన్నగూడూరు మండలాల బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పచ్చి మోసం, దగా చేసి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్, మాజీ వైస్ ఎంపీపీ గాదె అశోక్‌రెడ్డి, క్లాస్‌వన్ కాంట్రాక్టర్ రామగుడు అచ్చుత్‌రావు, పట్టణ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు గుగులోతు రాంబాబు, తేజావత్ రవీందర్‌నాయక్, డీఎస్ రాంసింగ్, జర్పుల కాలునాయక్, లతీఫ్, చెన్నారెడ్డి, తాళ్ళపల్లి శ్రీనివాస్, గడ్డం శ్రీను, ఉపేందర్, పిట్టల ధనుంజయ, బుచ్చయ్య, హరినాయక్, మునేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుంది'

బయ్యారం : రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయే రోజులు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మండలంలోని గంధంపల్లిలో ఆమె గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇల్లెందు నియోజకవర్గం నుంచి 4వేల మందిని సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు, బీఆర్ఎస్ నాయకులు ఆంగోత్ శ్రీకాంత్, జర్పుల శ్రీను, రాజేశ్, శోభన్, భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

● ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఎమ్మెల్యే కనకయ్యను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

గార్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. గురువారం గార్లలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పంచాయతీల్లో మెజారిటీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ స్థానాలు గెలుచుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోరం సురేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, పీఏసీఎస్ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీపీలు ఎం వెంకట్‌లాల్, బి.నాగరాజు, అజ్మీర బన్సీలాల్, పార్టీ జిల్లా నాయకులు కట్టా శ్రీనివాసరావు, బి హతీరాం, జి రాంసింగ్, ఏఎంసీ డైరెక్టర్ బి అశోక్, పి కిషన్, ఎల్ నాగేశ్వరరావు, జి లెనిన్, యాకూబ్‌పాషా, మోహిన్, రామ్‌కుమార్, రమేష్, వెంకయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

మహబూబాబాద్ అర్బన్ : పీపుల్స్ ప్రొగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు 5 నుంచి 7వ తరగతి ప్రవేశాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఏ.మురళీకృష్ణ, యాకూబ్ గురువారం తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో హాస్టల్ సౌకర్యంతో నాణ్యమైన ఇంగ్లిష్ మీడియంలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. ఈ నెల 20 తేదీ వరకు చివరి అవకాశమని అర్హులైన విద్యార్థులు దరఖాస్తులకు 9989009175, 9951512614 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. అదే విధంగా ప్రవేశాలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 24న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

తూకం వేసి.. బియ్యం సరఫరా చేయాలి



డోర్నకల్ : ఎంఎస్ పాయింట్ వద్ద రేషన్ డీలర్ల సమక్షంలో బియ్యాన్ని తూకం వేసి దుకాణాలకు సరఫరా చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు తేజావత్ లక్ష్మానాయక్ డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో గురువారం నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ నెలా గార్లలోని ఎస్ఎస్ పాయింట్ ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం బస్తాలకు సంబంధించి ఒక్కో బస్తాలో 2 నుంచి 7 కేజీల వరకు తక్కువ బియ్యం వస్తున్నాయని తెలిపారు. దీనిపై పాయింట్ ఇన్‌చార్జ్‌ని ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం చెబుతున్నాడని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లం అనిల్, మేదరమెట్ల సత్యనారాయణ, వెంకటరెడ్డి, రాజారాం, ఏరువ రజిని, వీరన్నగౌడ్, రాంబాబు, వల్మా పాల్గొన్నారు.

బియ్యం అందజేత

కేసముద్రం : మున్సిపాలిటీకి చెందిన ఎస్.వీరభద్రం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, సమ్మిగౌడ్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ క్వింటా బియ్యం గురువారం అందజేశాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు



తొర్రూరు: నిందితుడిని మహబూబాబాద్ జైలుకు తరలిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : గుడుంబా తయారీ, క్రయ, విక్రయాలపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని, గుడుంబా జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ అన్నారు. గుడుంబా నిర్మూలనలో భాగంగా బయ్యారం మండలం కోయగూడెం, చుంచుబంధం తండాల్లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ బృందాలు సంయుక్తంగా గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. 9 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, 900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. బానోతు చిట్టెమ్మ, భూక్య లక్ష్మి, గుగులోతు కైక, బానోతు జ్యోతి, ధరావత్ వల్కిపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నాగేశ్వర్ రావు, నీరజ, ఎస్సైలు చంద్రశేఖర్, అశోక్, కిరీటి, కానిస్టేబుళ్లు రాజు, వెంకటరమణ, వెంకటనర్సయ్య, ఇబ్రహీం, భవాని తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే చర్యలు తప్పవు

తొర్రూరు : గుడుంబా తయారు చేస్తే చర్యలు తప్పవని ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ రాజేశుని ప్రవీణ్ తెలిపారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 31 లీటర్ల నాటుసారా, 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఐదుగురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. 400 కిలోల నల్లబెల్లాన్ని కారులో తరలిస్తున్న రాయపర్తి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన చెంగాల రాజేష్‌ను అరెస్టు చేసి మహబూబాబాద్ జైలుకు తరలించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు రవళిరెడ్డి, శంకర్‌లు పాల్గొన్నారు.

కేసులు పెట్టకుండా వదిలేశారా?

దంతాలపల్లి : మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం, నెల్లికుదురు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం తొర్రూరు ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బుధవారం దంతాలపల్లి మండలంలో కొంతమందిని, గురువారం నెల్లికుదురు మండలంలోని కొంతమందిని పట్టుకెళ్లినట్లు సమాచారం. కానీ ఆ కేసుల వివరాలు చెబుతామని అబ్కారి శాఖ అధికారులు వెల్లడించలేదు. గుడుంబా తయారీదారులను ప్రజల ముందు పట్టుకెళ్లి తొర్రూరు తరలించి వారిపై కేసులు పెట్టకుండా వదిలేశారా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

'కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో బీజేపీ'



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహబూబాబాద్ రూరల్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల గుప్పిట్లో ఉంటూ వారు చెప్పినట్లు చేస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీతో కేసులను పెట్టించారని కాంగ్రెస్ సీనియర్ జిల్లా నాయకుడు దేవరం ప్రకాశ్ రెడ్డి విమర్శించారు. పార్టీ అగ్రనేతలపై ఈడీ పెట్టిన కేసులను నిరసిస్తూ డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ఆధ్వర్యంలో మానుకోటలోని మదర్ థెరిసా సెంటర్ వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకాశ్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మిట్టకంటి రామిరెడ్డి, ఎడ్ల రమేష్, పద్మం ప్రవీణ్ కుమార్, పోతురాజు రాజు, బండి శ్రీను, అజ్మీర సురేష్, నీరుటి లక్ష్మీనారాయణ, సిరిపురం వీరన్న, బండోజు ఉపేంద్రాచారి, భూక్య దశ్ సింగ్, బోడ రవి, ఆరెందుల వెంకటేశ్వర్లు, బొల్లు రాజు, లకావత్ పద్మబాయి, జంగాల సదాశివుడు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. నేతాజీ విగ్రహం సమీపంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య కేంద్ర ప్రభుత్వం అదాని, అంబానీ చెప్పినట్లు చేస్తూ కక్షపూరితంగా కేసులుపెట్టి ఇబ్బందులు పెడుతుందని విమర్శించారు. నాయకులు ఎండీ.హారుణ్, పింద్రాల రాందాసు, బానోత్ ప్రసాద్ నాయక్, మందాటి శ్రీనివాస్, బండారు చిరంజీవి, సప్పిడి రంజిత్, బట్టు దేవ్ సింగ్, అనంతుల రాజమ్మ, సరస్వతి, లక్ష్మి, బీమా, కుమార్, భాస్కర్, ఇరుగు వీరన్న, రాంజీనాయక్, బోడ రాము తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి




రమేశ్ (ఫైల్)

గార్ల : బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు ఇమ్మడి రమేశ్ (49) గోపాలపురంలోని స్వగృహంలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై హఠాన్మరణం పొందారు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. రమేష్ భౌతికకాయాన్ని వివిధ పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

గార్ల : ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడిన వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం గార్ల రైల్వే స్టేషన్‌లో జరిగింది. మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన చందావత్ లక్ష్మణ్ ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు నుంచి పడటంతో ముఖం, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని గార్ల సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు 108 అంబులెన్స్ సిబ్బంది పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒరిగిన విద్యుత్ స్తంభం



దంతాలపల్లి : గడ్డి తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని విద్యుత్ స్తంభం ఒరిగిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలంలోని గడ్డిని పశువుల కోసం ఇంటికి తరలిస్తున్నాడు. ఈక్రమంలో గ్రామంలోకి రాగానే ట్రాక్టర్‌లోని గడ్డి ఓ వైపునకు ఒరిగి విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో డ్రైవర్‌తో పాటు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా వల్లపు నరేష్

కురవి : సీరోలు మండల బీఎస్పీ అధ్యక్షుడిగా వల్లపు నరేష్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న గురువారం తెలిపారు. బీఎస్పీని మండలంలో బలోపేతం చేయాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

ఉదయశ్రీ మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

గూడూరు : స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం మండలంలోని 56 గ్రామైక్య సంఘాల ప్రతినిధులతో ఏపీఎం రవీందర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయశ్రీ మండల సమాఖ్య పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అయోధ్యపురం గ్రామానికి చెందిన బీమగాని మయూరి, కార్యదర్శిగా గోవిందాపురం గ్రామానికి చెందిన మూడు విజయ, కోశాధికారిగా గూడూరుకు చెందిన పోలెపాక ప్రియాంకతో పాటు మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యం

నెహ్రూసెంటర్: మెరుగైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని డీఈ విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హరికిషన్‌మిల్‌రోడ్, ఇందిరాసెంటర్, ధర్మన్న కాలనీ, కొండపల్లిగోపాల్‌నగర్ కాలనీ, మిల్ట్రీ కాలనీ, మంగళి కాలనీలో అధిక లోడ్ గల ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఏర్పాటు చేశారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : ఈ నెల 19వ తేదీన జరగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శంకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు.

21న తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ

డోర్నకల్ : సికింద్రాబాద్‌లో ఈ నెల 21న జరిగే తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి సంద్రగిరి కృష్ణమూర్తి కోరారు. స్థానిక బైపాస్ రోడ్డులోని అమరవీరుల స్తూపం వద్ద గురువారం ప్లీనరీకి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు : స్థానిక క్రీడా ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీ నుంచి జరుగనున్న ధన్‌రాజ్ స్మారక జిల్లాస్థాయి కార్క్ బాల్ క్రికెట్ పోటీల వాల్‌పోస్టర్లను మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్ నాయక్ కమిటీ సభ్యులతో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా క్రీడలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు అలుగు సపోర్ట్ వాల్‌కు మరమ్మత్తులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కుంట ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ ప్రతినిధి బృందం దెబ్బతిన్న అలుగు సపోర్ట్‌వాల్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్యక్రమంలో నాయకులు రాజన్న, మధు, తిరుపతిరావు, వెంకన్న, ఆనందరావు, మోహన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలో ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ సహకారంతో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మీసాల వెంకన్న ప్రారంభించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖప్రసవాలు

గార్ల : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నార్మల్ డెలివరీ అయ్యేలా ప్రోత్సహిస్తున్నామని సీహెచ్‌సీ డాక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో గర్భిణి కె.శ్రీలతకు నార్మల్ డెలివరీ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. స్టాఫ్‌నర్సులు రజని, స్వాతి పాల్గొన్నారు.

ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి

బయ్యారం : గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగావత్ శ్రీనివాస్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఇర్సులాపురంలో గురువారం నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శ్రీకాంత్, మురళి, రమేష్, చిరంజీవి, రాంబాబు, అరుణ, అంబిక, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర సమావేశం

నెహ్రూసెంటర్ : ఈ నెల 19న హైదరాబాద్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ గురువారం తెలిపారు. సమావేశాల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకొని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశాలకు సంఘం జాతీయ అధ్యక్షుడు దాస్‌రాం నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు, కమిటీ సభ్యులు పాల్గొంటారన్నారు.

క్రైస్తవుల భారీ ర్యాలీ



కేసముద్రం : గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని మున్సిపాలిటీ కేంద్రంలో కేఎంపీవైఎఫ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాములు సెంటర్ నుంచి మార్కెట్ వరకు ర్యాలీ చేపట్టగా మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

నేడు 'గుడ్ ఫ్రైడే'

మహబూబాబాద్ రూరల్ : యేసుక్రీస్తుకు సిలువ వేసిన సందర్భాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు, ఆరాధకులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే శుభ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) వేడుకను నేడు జిల్లా వ్యాప్తంగా జరుపుకోనున్నారు. జిల్లా కేంద్రంలోని పరిశుద్ధ పౌలు దేవాలయం (సీఎస్ఐ చర్చి), యేసుశక్తి, ఎల్షద్దాయ్, మరనాత, షారోన్, పీసీఐ చర్చి, మండలంలోని చర్చిలన్నింటిలో గుడ్ ఫ్రైడే ఆరాధనలు, ప్రార్థనలు నిర్వహించనున్నారు.

భయం భయంగా బడికి..

కేసముద్రం : పిచ్చి కుక్కలు దారి వెంట వెళ్తున్న ప్రతి ఒక్కరిపై దాడి చేస్తుండడంతో.. బడికి వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. దీంతో తమ వెంట కర్రలను తీసుకు వెళ్తున్న సంఘటన కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలో పిచ్చికుక్కలు బుధ, గురువారాల్లో ఏకంగా తొమ్మిది మందిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఈ క్రమంలో స్కూల్‌కు వెళ్లే పిల్లలు పిచ్చికుక్కలు కరుస్తాయని భయంతో బ్యాగులతో పాటు చేతిలో కర్ర పట్టుకుని బడికి వెళ్లి వస్తున్నారు. ఇప్పటికైనా పిచ్చికుక్కల బారి నుంచి తమను కాపాడాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.